ప్రజాశక్తి

గురువారం 2 ఫిబ్రవరి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

రాజధాని అమరావతి..

మళ్లీ అదేగతి!

- కేంద్ర బడ్జెట్లో దక్కని ప్రాధాన్యం
- పన్ను మినహాయింపులతో వేతన జీవులకు ఊరట
- ఎయిమ్స్‌కు రూ.250 కోట్ల కేటాయింపు?
- కేంద్ర బడ్జెట్‌పై పెదవి విరుపులు



ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2023-24 ఆర్థిక సంవత్సరానికి లోక్‌సభలో బుధవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ బడ్జెట్‌లో రాజధాని అమరావతి ప్రస్తావన లేదు. అనంతపురం-అమరావతి ఆరు లైన్ల రహదారిని నాలుగు లైన్లకు తగ్గించినా నిధుల కేటాయింపును ప్రస్తావించలేదు. విభజన హామీల అమలులో భాగంగా జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఎయిమ్స్‌కు రూ.250 కోట్లే కేటాయించారు. మూడేళ్లలో పూర్తికావాల్సిన ఎయిమ్స్ నిర్మాణం ప్రారంభమై ఏడేళ్లు దాటినా పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించలేకపోతోంది. వ్యవసాయ యూనవర్సిటీలకు కేటాయింపులు లేవు. గతేడాది బడ్జెట్‌లో గోదావరి-కృష్ణా, పెన్నా నదుల అనుసంధానంపై సర్వేకు అనుమతి ఇచ్చినా ఈ ఏడాది మళ్లీ ప్రస్తావన లేదు. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించేందుకు వివిధ వస్తువులపై పన్నుల తగ్గింపు, మినహాయింపులు లేవు. వంట నూనెలు తగ్గింపునకు తగిన ప్రతిపాదనలు లేవు.

ఆదాయ పన్ను చెల్లింపు దారులకు కొంత మినహాయింపులు లభించాయి. ప్రస్తుతం ఉన్న ఐదు లక్షల గరిష్టపరిమితిని కనీసం రూ.7 లక్షలకు పెంచారు. దీంతో ఉద్యోగ, వ్యాపార వర్గాలు కొంత సంతృప్తి వ్యక్తం చేశారు. తాజా ప్రతిపాదనల ప్రకారం రూ.3 లక్షల వరకు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. రూ.3 నుంచి ఆరు లక్షల వరకు 5 శాతం, రూ.6 నుంచి 9 లక్షల వరకు 10 శాతం, రూ.9 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు 15 శాతం, రూ.12 లక్షల నుంచి 15 లక్షల వరకు 20 శాతం, రూ.15 లక్షలు ఆదాయం దాటిన వారికి 30 శాతం పన్ను చెల్లిం చాలని బడ్జెట్‌లో మార్పులు చేశారు.

పిడుగురాళ్ల మెడికల్ కళాశాలకు నిధుల ప్రస్తావన లేదు. గుంటూరు-విజయవాడ మధ్య పిల్లల కోసం ప్రత్యేకంగా 200 పడకల ఆస్పత్రిని నిర్మించాలన్న ప్రతిపాదనకు ఆమోదం లభించలేదు. దీంతో ఈ ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. మద్దతు ధరలు లేక అల్లాడుతున్న రైతులకు సంబంధించి ఎటువంటి భరోసాను ఇవ్వలేకపోయారు. వ్యవసాయ రంగానికి కేటాయింపులు తగ్గాయి. ఎరువుల సబ్సిడీలు గణనీయంగా తగ్గించారు. అయితే తృణదాన్యాల సాగుకు ప్రోత్సహం ఇవ్వడం వల్ల పల్నాడు ప్రాంతంలో ఈ సాగు పెరిగే అవకాశం ఉంది. విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు పెరగలేదు. కరోనా వల్ల అనేక గుణపాఠాలు వచ్చినా వైద్య రంగానికి తగిన కేటాయింపులు లేకపోవడం ప్రభుత్వ వైద్యరంగాన్ని పూర్తిగా పట్టించుకోవడం లేదనడానికి నిదర్శనంగా నిలుస్తోంది. నిరుద్యోగులకు బడ్జెట్ తీవ్ర నిరాశ మిగిల్చింది. అయితే డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు గ్రామస్థాయిలో నెలకొల్పడం యువతకు కొంత మేలు చేస్తుందన్నారు. దేశంలో ఏకలవ్య పాఠశాల ఏర్పాటు ద్వారా గిరిజనులకు విద్యకు ప్రోత్సహకాలను ప్రకటించారు. ఈ పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. తద్వారా పల్నాడు జిల్లాలో కొన్ని పాఠశాలలు మంజూరయ్యే అవకాశం ఉంది. రైల్వేల కేటాయింపునకు సంబంధించి వివరాలు రెండు రోజుల్లో వస్తాయని గుంటూరు డివిజన్ అధికారులు తెలిపారు.



పొగలు కమ్ముకున్న వినుకొండ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు

రైలు భోగీ కింద మంటలు

- దట్టంగా వ్యాపించిన పొగలు
- ప్రయాణికులంతా సురక్షితం
- సాంకేతికత సమస్యతో 45 నిముషాలపాటు నిలిచిన ఎక్స్‌ప్రెస్ రైలు

ప్రజాశక్తి - వినుకొండ

కదులుతున్న రైలు భోగి నుండి మంటలు, పొగ రావడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పల్నాడు జిల్లా వినుకొండ స్టేషన్ వద్ద బుధవారం చోటుచేసుకున్న ఘటనపై వివరాల ప్రకారం.. గుంటూరు నుండి డోన్ వైపు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం మధ్యాహ్నం వినుకొండ సమీపంలోకి వస్తుండగానే ఇంజన్ వెనక నుండి 3వ భోగి కింద నుండి కొద్దిపాటి మంటలు, దట్టమైన పొగలు రావడంతో వినుకొండ రైల్వే స్టేషన్లో నిలిపివేశారు. వెంటనే అందులోని ప్రయాణికులు భయాందోళనతో కిందికి పరుగులు పెట్టారు. కొన్ని క్షణాల్లోనే రైల్వే స్టేషన్ మొత్తం పొగ కమ్మేసింది. గమనించిన లోకోపైలెట్, కో లోకోపైలట్ ఇద్దరూ మంట నియంత్రణ సిలిండర్ సహాయంతో గ్యాస్‌ను చల్లి మంటలను అదుపు చేశారు. అనంతరం రైలను స్టేషన్‌లోనే 45 నిముషాల పాటు ఉంచి పరిశీలించారు. స్వల్ప సాంకేతిక లోపమే మంటలకు కారణమని గుర్తించారు. అయినా ప్రమాదమేమీ లేదని నిర్ధారించుకొని రైతులను ముందుకు నడిపించారు.

మిర్చియార్డులో వ్యాపారి కిడ్నాప్

- దాడి చేసి దోర్నాల వద్ద విడిచిపెట్టిన ముఠా
- ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఘటన మెయిన్‌లో

బాల కార్మికుల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - మంగళగిరి

బాల కార్మికుల గుర్తింపునకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. 'గణతంత్ర దినోత్సవం సాక్షిగా చిత్తు కాగితాలు ఏరుకుంటున్న చిట్టి చేతులు' శీర్షికన గతనెల 28వ తేదీన ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో వారి ఆదేశాలతో బాలల సంక్షేమ శాఖ, ఐసిడిఎస్ అధికారులు మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లోని ఫ్యాన్సీ షాపులు, చెప్పులు షాపుల్లో, వాహనాలకు వాటర్ సర్వీసింగ్ చేసే ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. వీధివిక్రేతలుగా పని చేస్తున్న నలుగురు బాలలు, వివిధ చోట్ల కార్మికులుగా పని చేస్తున్న మరో 9 మంది బాలలను గుర్తించారు. వీధి విక్రేతలుగా పని చేస్తున్న వారిని గుంటూరులోని బాలల సంక్షేమ కార్యాలయానికి తీసుకెళ్లగా, బాల కార్మికులుగా పని చేస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పాఠశాలల్లో చేర్పిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బేబీ రాణి, లక్ష్మి, బి.చంద్రశేఖర్, సిడిపిఒ ఉదయలక్ష్మి, సూపర్‌వైజర్ మాధవిలత, మంగళగిరి సహాయ కార్మిక అధికారి సిహెచ్.మూర్తి పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై ఇదీ అభిప్రాయం..

వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, సంస్థల ప్రతినిధుల అభిప్రాయాలు 8 లో

రేపటి సంకల్ప దీక్షను జయప్రదం చేయండి

- యుటిఎఫ్ పిలుపు
- చిలకలూరిపేట, మంగళగిరిలో పోస్టర్ల ఆవిష్కరణ

వార్తలు లోపలి పేజీల్లో

అన్ని స్కిల్ హబ్స్‌లో శిక్షణ ప్రారంభించాలి

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

పరిశ్రమల్లో ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను నిరుద్యోగ యువతకు శిక్షణందించేలా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుంటూ ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. స్కిల్ హబ్స్, స్కిల్ కళాశాల పనితీరుపై కలక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలసి అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఎనిమిది స్కిల్ హబ్స్‌లో ఇప్పటికీ శిక్షణా తరగతులు ప్రారంభించని రెండు హబ్స్‌లో 10వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో శిక్షణను ప్రారంభించాలన్నారు. నైపుణ్య శిక్షణకు నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధి సంస్థ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించేలా పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపిడిఒలు చర్యలు తీసుకోవాలని చెప్పారు. నియోజకవర్గాల్లో ప్రతినెలా నిర్వహించే జాబ్ మేళాల్లో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ కమిటీలోని అధికారులందర్నీ భాగస్వామ్యులను చేసి స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి ముందస్తుగా జాబ్‌మేళాపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సిఇఒ జె.మోహనరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రణయ్, ఉపాధి అధికారి రఘు, జాబ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివప్రసాదరెడ్డి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కె.విజయ రత్నం, మెప్మా పీడీ వెంకటనారాయణ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న విజయ

హార్ట్ స్ట్రోక్‌పై అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

ఇన్సూరెన్స్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో బుధవారం హార్ట్, బ్రెయిన్‌స్ట్రోక్ వంటి ఆరోగ్య సమస్యలపై స్పెషలిస్టులతో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యానగర్‌లోని ఎల్ఐసి విద్యానగర్ బ్రాంచ్‌లో ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయ మాట్లాడుతూ హార్ట్, బ్రెయిన్‌స్ట్రోక్ ఏఏ సందర్భాల్లో వస్తుంది, అవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒకవేళ వస్తే ఎంత సమయంలో డాక్టర్‌ను సంప్రదించాలో వివరించారు. కార్యక్రమానికి జి.శివరామకృష్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డి.రామారావు, పి.హైమానంద్, పి.రాజశేఖర్, టి.రామలింగేశ్వరరావు, బిబి శర్మ, ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.



40 మంది 'కృష్ణవేణి' విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-నరసరావుపేట

బెంగళూరుకు చెందిన ప్రఖ్యాత ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ ఐ.ఎల్.ఎం (ఇన్స్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ మేనేజ్మెంట్)ల ప్రైవేట్ లిమిటెడ్ తమ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 120 మంది విద్యార్థులు పాల్గొనగా 40 మంది విద్యార్థులుకమ్యూనికేట్ ట్రైనర్ లుగా కొలువులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్ ఆర్ పాషా ఆధ్వర్యంలో గ్రూప్ డిస్కషన్, హెచ్ ఆర్ టెక్నికల్ విభాగాలలో ఇంటర్వ్యూలు నిర్వ హించి ప్రతిభ చాటిన విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఒక్కొక్కరికి వార్షిక వేతనం రూ.2. 52 లక్షలు, ఉచిత వసతి కంపెనీ కల్పించిందన్నారు. డిగ్రీ పూర్తయిన అనంతరం వారు ఈ ఉద్యోగాలలో చేరనున్నట్లు హెచ్‌ఆర్ పాషా తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ , టిపిఒ ఎం. బాల కోటేశ్వరరావు, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది అభినందిం చారు.



ఘనంగా ఎన్‌ఆర్‌ఐ 8వ వార్షికోత్సవం

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్

ఎన్‌ఆర్‌ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ ఛైర్మన్ డాక్టర్ శివ ప్రభౌధ్, డాక్టర్ శాంసన్ సంజీవరావుల ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఐ 8వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ఎన్ ఆర్‌ఐ అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్ రావు, ఎయిమ్స్ మంగళగిరి అసోసియేటెడ్ డీన్ డాక్టర్ సునీల్ శర్మ విచ్చేశారు. కార్యక్రమంలో పీజీ విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్ , పేపర్ ప్రజెంటేషన్ జరగుతుంది. ఈ ప్రజెంటేషన్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులను అతిధులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ , మెడికల్ సూపరింటిండెంట్ డాక్టర్ శ్రీనివాస రావు , సెక్రెటరీ వెంకటేశ్వర రావు , డిప్యూటీ మెడికల్ సూపరిడెంట్ డాక్టర్ కుమార్ చౌదరి, పీజీ స్టడీస్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఫణీంద్ర, కళాశాలలోని డిపార్ట్మెంట్ అధిపతులు,విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల పనితీరులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి- గుంటూరు

జిల్లాలో గ్రామ/వార్డు సచివాలయాల పనితీరు మెరుగుపరచడంలో నిర్లక్ష్యం వహించే పర్యవేక్షణాధికారులపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం తాడేపల్లిలోని యంటీయంసీ మున్సిపల్ అదనపు కమీషనర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ ఎం. వేణు గోపాల్ రెడ్డి అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సబ్ కలెక్టర్, ఆర్డీఓ, మున్సిపల్ కమీషనర్లు, తహశీల్దార్లు, యంపీడీఓలు, హౌసింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రభుత్వ సేవల దరఖాస్తులను విత్ ఇన్ ఎస్ఎల్ఏలోనే ఖచ్చితంగా పరిష్కరించాలన్నారు.సచివాలయాల పనితీరుపై యంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, నోడల్ అధికారులు వారంలో మూడు రోజులు క్షేత్ర స్థాయిలో



విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

పరిశీలించి సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదాయ, కుల ధవీకరణ పత్రాల దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా సబ్ కలెక్టర్, ఆర్డీఓ తహశీల్దార్లతో నిరంతరం పర్యవేక్షి ంచాలన్నారు. కలక్టరేట్ సమావేశంల కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట రామి రెడ్డి, జెడ్పీ సిఇఓ జే. మోహన్ రావు, సిపిఓ శేషశ్రీ పాల్గొన్నారు.

9, 12 తేదీల్లో కెఎల్‌పిలో స్పెల్ బి, క్విజ్‌బి పోటీలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న రాయపాటి శ్రీనివాస్, కష్ణప్రాద్ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్పి పబ్లిక్ స్కూల్లో ఈనెల 9వ తేదీన స్పెల్ బి, 12న రాష్ట్ర స్థాయి క్విజ్ బి పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. బుధవారం పోటీల బ్రోచర్‌ను నాగార్జునా ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ విడుదల చేశారు. స్పెల్‌బీ పోటీల్లో 8-10 తరగతి విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉంటుందని, ప్రతి పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థులు పాల్గొనవచ్చని కృష్ణప్రసాద్ తెలిపారు.ముందుగా రాతపరీక్ష ఉంటుందని, అందులో అర్హత సాధించిన విద్యార్థులు ఫైనల్స్‌లో పాల్గొంటారన్నారు. ఫైనల్స్‌లో పవర్ స్పెల్, స్పెల్ట్ బి, రాపిడ్ ఫైర్ వంటి మూడు రౌండ్స్ ఉంటాయన్నారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమౌతాయన్నారు. అలాగే సూపర్ క్విజ్ బి పోటీలకు సంబంధించి ఉదయం 10.30 గంటలకు ప్రిలిమినరీ రౌండ్ ఉంటుందని, ఇందులో అర్హత సాధించిన 6 గ్రూపులను ఫైనల్స్‌కు పంపించటం జరుగుతుందన్నారు. 8, 9,10వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. విజేతలకు నగదు బహుమతి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9948227362, 7013825972 నంబర్లలో సంప్రదించాలన్నారు.బ్రోచర్ ఆవిష్కరణలో ప్రిన్సిపాల్ వై.రధినీచౌదరి పాల్గొన్నారు.

కెఎల్‌యు పూర్వ విద్యార్థి డాక్టర్ సజన్‌కు సన్మానం

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

గతంలో కెఎల్ విశ్వవిద్యాలయంలో బి టెక్ చదివి కెనడాలో స్థిరపడిన డాక్టర్ సజన్ బుధవారం విశ్వవిద్యాలయాన్ని సందర్శించి, ఇసిఇ విద్యార్థులకు పలు రకాల సందేహాలను నివృత్తి చేశారు. నైపుణ్యాలను ఎలా మెరుగుపరుచుకోవాలి, భవిష్యత్తులో విజయం ఎలా సాధించాలనే దానిపై శిక్షణను అందించారు. 1999-2003 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ సజన్ సికి విశ్వవిద్యాలయ ఇసిఇ విభాగం అధిపతి డాక్టర్ సుమన్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ సజన్ సి మాట్లాడుతూ కెఎల్‌యులో ముఖ్యమైన పరిశోధకులు తమ విద్యార్థులకు ఎంతో ప్రతిష్టాత్మకమైన విద్యను అందిస్తున్నారని అన్నారు. అత్యాధునిక పరిశోధనా కేంద్రాలు, ల్యాబ్‌లు తదితర సౌకర్యాలతో పాటు నైపుణ్యం కలిగిన అధ్యాపకులను కలిగి


సజన్‌సిని సన్మానిస్తున్న అధ్యాపకులు

ఉండడం కెఎల్‌యు ప్రత్యేకత అని కొనియాడారు. అనంతరం సజన్‌సిను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రో వైస్ చాన్సులర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, ఇసిఇ విభాగం అధిపతి డాక్టర్ ఎం. సుమన్, పరిశోధనా అభివద్ధి విభాగం డైరెక్టర్ డాక్టర్ శరత్ కుమార్, పూర్వవిద్యార్థుల విభాగం డైరెక్టర్ శ్రీకావ్య తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు,నాయకులు

అంగన్‌వాడీల సమస్యలపై వినతి

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం ఫిబ్రవరి 6వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టాలని ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు)రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. బుధవారం సిడిపిఓ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ సెంటర్లు మూసివేసి ఆయాలు, హెల్పర్లు అందరూ గుంటూరులో జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పొన్నూరు మండల కార్యదర్శి నిమ్మకు రమేష్ బాబు, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఎం.వి. సుకన్య, జి విజయ కుమారి, పిడి విజయలక్ష్మి ,కృష్ణ కుమారి,పద్మజ, సౌమ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నం వడ్డించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

పట్టణంలోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మధ్యాహ్న భోజనాని పరిశీలించి విద్యార్థులతో కలసి భోజనం చేసినారు. స్కూలు విద్యార్థులకు భోజనం వడ్డించారు. స్కూల్ అభివృద్ధి పరంగా కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పిస్తానని హామీ ఇచ్చారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ డైరెక్టర్ దాసరి నారాయణరావు, షేక్ మాము, కొల్లేరు శ్రీనివాసరావు, ఆకుల వెంకటేశ్వరరావు, రూరల్ సర్పంచులు భవనం వంశీ రెడ్డి, అక్కి నాగరాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్, జిఎంసి ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం జిఎంసి జిఎంసి కాన్ఫరెన్స్ హాల్లో ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్మెంట్ అధికారులతో జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉగాది నాటికి ప్రతి లేఅవుట్‌లో ఇళ్ళను గృహ ప్రవేశాలకు సిద్దం చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని, లబ్దిదారులు ఇళ్ళ నిర్మాణం చేసుకునేలా సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.సమావేశంలో డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కష్ణయ్య, హౌసింగ్ పి.డి. సాయినాద్‌కుమార్, ఈఈ శంకరరావు, నగరపాలక సంస్థ ఎస్.ఈ. భాస్కర్, ఈ.ఈ.లు సుందర్రామిరెడ్డి, శాంతిరాజు, కొండారెడ్డి, కోటేశ్వరరావు, హౌసింగ్, నగరపాలక సంస్థ డిఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఎఎన్‌యులో జాతీయ సదస్సు

ప్రజాశక్తి-ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో " అడ్వాన్సస్ ఇన్ ఫైటో మెడిసిన్ అండ్ ఫైటో నానో కంపోజిట్స్ అనే అంశంపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు విశ్వవిద్యాలయ రెక్టర్ ఆచార్య పి. వరప్రసాద మూర్తి అధ్యక్షత వహించగా, ఉపకులపతి ఆచార్య పట్టేటి రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ మానవజాతి ఆవిర్భావంలో మనుషులందరూ అడవులలోనే జీవించే వారని అన్నారు. ప్రకతి వైపరీత్యాలు,రోగాలను ఎదిరించి జీవనం సాగించే క్రమంలో వక్షజాతి సంబంధ మూలికలను రోగ నివారణకు ఉపయోగించేవారని అన్నారు. ఆధునిక వైద్యశాస్త్రం అభివద్ధి చెందినప్పటికీ నాచురల్ ప్రొడక్ట్స్ నుంచి తయారు చేసే మందులు శక్తివంతంగా పనిచేయటమే కాక తక్కువ సైడ్ ఎఫెక్ట్స్ కలిగి ఉంటాయన్నారు. రెక్టార్ వరప్రసాద్ మూర్తి మాట్లాడుతూ మొక్కలనుంచి నాణ్యమైన మందులు తాయారుచేయవచ్చు అన్నారు.కీనోట్ స్పీకర్ మరియు విశిష్ట అతిథి ఆచార్య నండూరి శ్రీనివాస్ మాట్లాడుతూ మొక్కలు, జంతువులు, బ్యాక్టీరియాల నుండి సహజ సిద్ధంగా లభించే ఆక్టివ్ ఫార్మాసియుటికల్ ఇంగ్రిడియంట్స్ మరింత శక్తివంతంగా తయారు చేసేందుకు సెమీ సింథటిక్ ప్రాసెస్ ను ఉపయోగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఏ.ప్రమీలరాణి, ఓ ఎస్ డి ఆచార్య సునీత ప్రసంగించారు. ఫార్మసీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ డి.రవిశంకర్ రెడ్డి, డాక్టర్ .అన్నపూర్ణ, డాక్టర్ పి.రోహిణి, డాక్టర్.సజిని , డాక్టర్ ఎం.గాయత్రి రమ్య, కె.విజయ్ కిషోర్, డాక్టర్ కే.యి.ప్రవళిక మరియు అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్

అసభ్యకర పోస్టుల వ్యక్తి ఆటకట్టు

సైబర్ నేరాలపై ధైర్యంగా ఫిర్యాదు చేయండి

వివరాలు, సాక్ష్యాలు గోప్యంగా ఉంచుతాం : చేబ్రోలు ఎస్ఐ

ప్రజాశక్తి - చేబ్రోలు

విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థిని ఫిర్యాదుతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అసభ్యకర పోస్టులను పంపి బెదిరింపులకు పాల్పడుతున్న గుర్తుతెలియన వ్యక్తి ఆటకట్టించారు చేబ్రోలు పోలీసులు. ఇందుకు సంబంధించిన వివరాలను చేబ్రోలు ఎస్ఐ జి.వెంకటాద్రి బుధవారం విలేకరుల సమావేశంలో చెప్పారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్ కాలేజీ హాస్టల్‌లో ఉంటూ, విజ్ఞాన్ యూనివర్సిటి లో బిటెక్ చివరి సంవత్సరం చదువుతున్న ఒక విద్యార్థిని ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు గుర్తుతెలి యని వ్యక్తి తన ప్రొఫైలు ఫొటోతో ఫేక్ ఇన్‌స్టా ఐడి ని క్రియేట్ చేసి,ఆ విద్యార్థిని ఖాతాకు గత నెల 1వ తేదీన సందేశం పంపి, ఆమె ఫేస్ పిక్ ను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి, డబ్బులు ఇవ్వమంటూ బెది రింపులకు పాల్పడ్డాడు. ఈ బెదిరింపులకు ఆమె భయపడలేదు. దీంతో, ఆమె ఫేస్ తో మార్ఫింగ్ చేసిన అసభ్యకరమైన ఫోటో ను ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ విద్యార్థిని స్నేహితులకు ఆ వ్యక్తి షేర్ చేశాడు. ఈ విషయాన్ని తన స్నేహితుల ద్వారా తెలుసుకున్న ఆమె చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా చేబ్రోలు ఎస్ఐ జి.వెంకటాద్రి, గుంటూరు జిల్లా సైబర్ ఎస్ఐ వెంకటకృష్ణ కలిసి కేసుకు సంబంధించిన సాంకేతిక ఆధా రాలను సేకరించి, నేరానికి పాల్పడ్డ నింది తుడి చిరునామాను కనుగొన్నారు.

నిందితుడు పశ్చిమ గోదావరి జిల్లా చాగల్లు మండలంలోని నేలటూరుకు చెందిన వట్టికూటి మణి శ్రీరామ్ అని, అతని వయసు 26 సంవత్సరాలు అని గుర్తించారు. గత నెల 30వ తేదీ సాయంత్రం చేబ్రోలు ఎస్ఐ తన సిబ్బందితో కలిసి, మణిశ్రీరామ్‌ను అతని ఇంటి వద్ద పట్టుకొని అరెస్టు చేశారు. జ్యుడిషియల్ రిమాండ్ కు తరలించారు. సైబర్ నేరాలకు పాల్పడే నేరస్తులపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చెప్పారు. సోషల్ మీడియా యాప్, లోన్ యాప్ వంటి సైబర్ నేరాల బారిన పడకుండా యువత అప్రమత్తముగా ఉండాలని సూచించారు. విద్యార్థులు సైబర్ నేరాలకు పాల్పడి వారి విలువైన జీవితాన్ని పాడు చేసుకోవద్దని అన్నారు. ఈ తరహా నేరాలకు పాల్పడే, బెదిరింపు చర్యలకు దిగే వారిపై ధైర్యంగా వచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఫిర్యాదు చేసే వారి వివరాలు, సాక్ష్యాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న చేబ్రోలు ఎస్ఐ

9 మంది జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి-నూజెండ్ల

మండల కేంద్రమైన నూజెండ్ల గ్రామ దగ్గరలో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న సమాచారంతో అయినవోలు పోలీసులు దాడి నిర్వహించి జూదరులను అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఐదు మోటర్ సైకిళ్లు, ఏడు ఫోన్లు, సుమారు నాలుగు లక్షల యాభై రెండు వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు అయినవోలు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అరెస్ట్ అయిన వారు తియగూర శివ వెంకట్ రెడ్డి, పాణ్యం కృష్ణారెడ్డి, బ్రహ్మం, చిక్కుడు నాసరయ్య సుబ్బారెడ్డి, కొప్పుల రంగారావు, బిరం వెంకటేశ్వరరెడ్డి, బ్రహ్మ య్య, చిట్టి సుబ్బారెడ్డి ఉన్నారు. వీరిని కోర్టులో హాజరు పరిచారు. ఈ దాడిలో అయినవోలు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు

దేవాలయంలో హుండీ చోరీ

ప్రజాశక్తి-నకరికల్లు



మండల కేంద్రమైన నకరికల్లోని కొండపై ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలోని హుండీని పగలగొట్టిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దొంగలు హుండీని పగలగొట్టి సుమారు రూ.4,000 ను ఎత్తుకెళ్లారు. దక్షిణ వైపు గేటు తాళాలను పగలగొట్టి సిసి కెమెరాలు పక్కకు తిప్పి మెమరీ బోర్డును దొంగలించినట్లు తెలిపారు. నైట్ వాచ్ మెన్ కిందనున్న కళ్యాణ మండపం దగ్గర పడుకున్నట్లు తెలిపారు. దేవాలయం ఈవో వెంకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. క్లూస్ టీమ్ వివరాలు సేకరించింది.

హత్య కేసు కొట్టివేత

ప్రజాశక్తి-తెనాలి


దొంగతనం, రాబరీ, హత్య నేరం కింద నమోదైన కేసును విచారణ అనంతరం 11వ అదనపు జిల్లా జడ్జి జి.మాలతి బుధవారం కొట్టివేస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2020 నవంబర్ 3న బలుసులపాలెం కమ్మవారం పాలెం మధ్య గల డ్రెయిన్ లో కొటారి సామ్రాజ్యం అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. రేపల్లె రూరల్ సర్కిల్ పోలీసులు ఈ కేసు నమోదు చేశారు.

కేసులో బెస్తవారిపాలెం కు చెందిన పోతార్లంక శ్రీనివాసరావు, పోతారు లంక పద్మావతిలను అనుమానించి వారిపై దొంగతనం, రాబరీ, హత్యానరం కింద కేసు నమోదు చేశారు. కేసు విచారణ పూర్తయిన అనంతరం నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టి వేస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నిందితుల తరఫున న్యాయ వాదులు ఎస్టీ ప్రసాద్, పేట ప్రత్యూష, ఎస్కే ఫిరోజ్ భాషా వాదించారు.

సచివాలయంలో సిపి కెమెరాలు చోరీ

ప్రజాశక్తి - తాడేపల్లి

పెనుమాక గ్రామ సచివాలయం లో గోడలకు అమర్చిన సిసి కెమెరాలు చోరీకి గురయ్యాయి. అర్ధరాత్రి సమయంలో మూడు కెమెరాలను చోరీ చేశారు. కొంత మంది యువకులు కెమెరాలను తొలగిస్తుండగా వేరే కెమెరాలలో ఈ దృశ్యాలు రికార్డయ్యాయి. వీటి ఆధారంగా తాడేపల్లి పోలీసులకు సచివాలయ అధికారులు ఫిర్యాదు చేశారు.







మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 1,00,646
మిర్చి ఎగుమతి	: 1,04,438
మిర్చి నిల్వ	: 71,386

మిర్చి ధరలు

రూపాయలలో

334	7,000 - 23,500
నెం.5	12,000- 19,500
273	10,000 - 18,600
341	8,000 - 20,000
4884	13,000 - 16,500
సూపర్ 10	17,500 - 19,000
నాన్ ఎసి	
తేజ	7,500 - 20,000
బడిగి	12,000 - 25,000
దేవనూరు డీలక్స్	12,000- 23,000
తాలుకాయలు	4,000 - 12,500



బార్లీ పొగాకు క్షేత్ర పరిశీలన

ప్రజాశక్తి-వినుకొండ

వినుకొండ మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో బార్లీ పొగాకు క్షేత్రాన్ని గుంటూరు టుబాకో బోర్డు డైరెక్టర్ (ఆక్షన్స్) పొగాకు బోర్డు అశ్విని నాయుడు, జిపిఐ. కంపెనీతో సంయుక్తంగా సందర్శించారు. జిపిఐ కంపెనీ చేపట్టిన ఐపీఎస్ సిస్టం గురించి సాగు చేయు పద్ధతులు గురించి పలు వివరాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. జిపిఐ రైతులు పాటిస్తున్న సుస్థిరమైన పొగాకు సాగు పద్ధతులు తెలుసుకొని ప్రశంసించారు. జిపిఐ కంపెనీ పొగాకు సాగులో చేపట్టిన యాంత్రికరణ అభివద్ధిని పరిశీలించి రైతుల నుండి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా జిపిఐ వైస్ ప్రెసిడెంట్ జితేంద్ర కుమార్, మాట్లాడుతూ జిపిఐ. కంపెనీ అన్ని విధాలుగా రైతులకు నాణ్యమైన అధిక దిగుబడులు సాధించే దిశగా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులకు పంట సాగు పద్ధతులను అవగాహన కల్పిస్తూ పంట అభివద్ధికి సహకారం అందిస్తామని తెలిపారు జిపిఐ జనరల్ మేనేజర్ ఎం ప్రభాకర్ రావు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించి బార్లీ పొగాకు సాగుకు రైతులు ముందుకు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిపిఐ మేనేజర్ పునీత్, వీరారెడ్డి, కోటేశ్వరరావు, వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి -సత్తెనపల్లి

పట్టణంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు, సిఐటియు నాయకులు కమిషనర్ కె.షమ్మీను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. హరిపోతురాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు గత సం వత్సరం కాలం నుంచి పారిశుధ్య రక్షణ పరికరాలైన బ్లౌజులు, మాస్కులు, చెప్పులు, పారిశుధ్య పనిముట్లైనటువంటి చీపు రులు, పారలు ఇవ్వటం లేదని అలాగే చెత్తను సేకరించటం తడి చెత్త పొడి చెత్తగా వేరు చేయటం తీసుకెళ్లి టక్కుల దగ్గర పోయటం వంటి పనులన్నీ కూడా ఒక్కరే చేస్తున్నారని అదనపు సిబ్బందిని కేటాయించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ రెండు రోజుల్లో అందరికీ అందేలా చూస్తామని ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. అలాగే వర్కర్స్ ని ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు కేటాయించడం వల్ల కొద్ది మంది వర్కర్స్ ఉండి పనిచేసేటువంటి నేపథ్యంలో ఇబ్బందులు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. మచ్చర్ విధానం అందరికీ అందుబాటులోకి రానట్లయితే ఎవరికైతే ఐడి రాలేదో వారు పాత పద్ధతిలోనే మచ్చరూ వేయించుకోవాలని సూచిం చారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సత్తెనపల్లి కమిటీ ప్రెసిడెంట్ సిహెచ్ వెంకయ్య, మేడ సత్యవతి పాల్గొన్నారు.

జనాలకు పన్ను బాదుడు.. డ్రైవర్లకు పూట గడవదు..

- జీతాలివ్వక యార్డులో నిలిచిపోయిన చెత్త ఆటోలు
- పెట్రోల్ కు డబ్బు ల్లేవు
- వసూలు చేసిన సొమ్ము ఎక్కడ?



ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేట పట్టణంలో మున్సిపాలిటి చెత్తను తరలించే ఆటోలకు బకాయిలు, డ్రైవర్ల కు జీతాలు చెల్లించక పోవడంతో ఎక్కడివి అక్కడ నిలిచి పోయాయి. డ్రైవర్లతో సహా ఆటోల నిర్వహణ మొదటి నుంచి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు. దీంతో వారు వివిధ రకాల నిబంధనలతో డ్రైవర్లకు, ఆటోల పెట్రోల్ ఖర్చులు మాత్రమే ఇస్తున్నారని డ్రైవర్లు వాపో తున్నారు. ఈ విషయమై ప్రశ్నిస్తే బిల్లులు ఇం కా రాలేదని వచ్చిన తర్వాత ఇస్తామనే సమాధానం చెబుతున్నారని వారు చెబు తున్నారు. మున్సి పాలిటి చెత్త ఆటోల నిర్వహణ గుం టూరుకు చెందిన రెడ్డి ఎంటర్ప్రైజెస్ అనే ప్రైవేట్ సంస్థకు అప్పచెప్పారు. పట్టణంలో మొత్తం 38 వార్డులు న్నాయి. వాటిల్లో గణపవరం 5 వార్డు లు, పసుమర్తి 2వార్డుల తీసివేస్తే పట్ట ణంలో ఉన్న వార్డులు మొత్తం 31. ఇందులో 20 ఆటో చెత్తా బళ్లను తిప్పుచున్నారు. ఒక్కొక్క చెత్త ఆటోకు రోజుకు రూ.2, 031 చొప్పున నెలకు రూ.60, 930 చెల్లిస్తున్నారు. 20 ఆటోలకు కలిపి రూ.12,18,600 చెల్లిస్తున్నారు. పట్టణంలో గృహాలు కానీ వ్యాపార సముదాయాలు కానీ మొత్తంగా నెలకు 20 వేల మంది దగ్గర సగటున రూ.60 రూ. చొప్పున వసూలు చేస్తే చెత్త ఆటో ఖర్చులు వస్తాయి. అయితే ముగిలిన వ్యాపార సముదాయాలు, హోట ళ్ల, ఆసుపత్రులు, వాణిజ్య, వ్యాపా ర కేంద్రాల్లో వసూలు అయిన సొమ్ము ఏమౌతున్నాయో అర్థం కావడం లేదు.

మాకు సంబంధం లేదు



పన్ను వసూలు కొంత ఆలస్యమవుతోందని, దానికి ఆటో డ్రైవర్ జీతాలు, ఇతర ఖర్చులు తమకు సంబంధం లేదని పట్టణ మున్సిపల్ కమిషనర్ సిహెచ్ గోవిందరావు అన్నారు. పట్ట ణంలో వసూలు అయినవి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఖాతాలో జమ చేస్తామని చెప్పా రు. అక్కడ నుంచి డ్రైవర్లకు, ఆటో మెయింటె నెన్స్ కు డబ్బులు వారిస్తారని అన్నారు.

ఆ డబ్బు ఎటుపోతోంది?



చెత్త పన్ను అద నంగా వసూలు చేయ డం అన్యాయమని సిఐటియు మండల కార్యదర్శి పేరు బోయిన వెంకటేశ్వర్లు అన్నారు. చెత్త వంకతో అయ్యే ఖర్చులో నాలుగు ఐదు రెట్లు అద నంగా వసూలు అవు తున్నాయని ఆ డబ్బులు ఎటు పోతున్నాయో తెలియదని విమర్శిం చారు. చెత్త పన్ను తీసివేసి వేయాలని, ఈ ఆటో లను మున్సిపాలిటీ కార్యాలయం దగ్గరలో ఉంచాలని, ఆటో డ్రైవర్లకు మెయింటెనెన్స్ మున్సిపాలిటీ వారే భరించాలని డిమాండ్ చేశారు. మధ్యవర్తుల వ్యవస్థను రద్దు చేస్తామంటూనే ప్రభుత్వం దానిని ప్రోత్స హించడం దారుణమన్నారు.

3 నెలలుగా జీతం లేదు

సుమారు యాబై ఏళ్లుగా తాను డ్రైవర్ వృత్తిలో ఉన్నానని , వయసు భారంతో స్థానికంగా ఉండవచ్చనే ఉద్దేశంతో చెత్త ఆటోకు పనిచేసేందుకు ఒప్పు కున్నానని అన్నపురెడ్డి శ్రీనివాస రావు అన్నారు. 3 నెలల నుంచి జీతం రావడం లేదని వాపోయారు. కుటుంబం గడవడం కష్టంగా ఉందని చెప్పారు. చెత్త ఆటోలు నిలిపేందుకు సరైన స్థలం లేక ఊరి బయట సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మార్కెట్ యార్డులో ఉంచి ఇంటికి వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. అక్కడికి వెళ్లి వచ్చేందుకు ఆటో ఖర్చులు అవుతున్నాయన్నారు. ఈ ఖర్చు నెలకు రూ.1000 వరకు ఉందని అన్నారు.

రేపటి సంకల్ప దీక్షను జయప్రదం చేయండి

యుటిఎఫ్ పల్నాడు జిల్లా కమిటి పిలుపు

ప్రజాశక్తి-నరసరావుపేట



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు

ఉద్యోగుల ఉపాధ్యాయులకు జీవిత భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్న సిపిఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్టీఆర్ జిల్లా గన్నవరం ధర్మస్థలి వద్ద ఈ నెల 3న జరగనున్న సంకల్ప దీక్షను జయప్రదం చేయాలని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి ప్రేమ్ కుమార్, జి విజయ సారధిలు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం యుటిఎఫ్ ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి ప్రేమ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మొదటి నుండి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తుందని రాజస్థాన్ ,చత్తీస్ ఘడ్ , జార్ఖండ్ , పంజాబ్ రాష్ట్రాలు సిపిఎస్ రద్దు చేసి, తమ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాయని అన్నారు. ఇటీవల నూతనంగా ఏర్పడిన హిమాచల్ ప్రభుత్వం సైతం ఉద్యోగుల సామాజిక భద్రత కోసం పాత పెన్షన్ పునరుద్ధరించిందన్నారు. పొరుగున తమిళనాడు సైతం ఈ ఏడాది ఏప్రిల్ నుండి పాత పెన్షన్ విధానం అమలు చేయనున్నట్లు ప్రకటించిందని పేర్కొన్నారు.అధికారంలోకి వస్తే వారంలో సిపిఎస్ రద్దు చేస్తామని పాదయాత్రలో ప్రగల్భాలు పలికిన జగన్మోహన్ రెడ్డి మేనిఫెస్టోలో సైతం సిపిఎస్ రద్దు హామీ ఉంచారని అధికారంలోకి వచ్చిన తర్వాత సిపిఎస్ రద్దుపై మాట మారుస్తూ మరో నష్టదాయకమైన జిపిఎస్ ఉద్యోగ,ఉపాధ్యాయులను తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. ధర్మస్థలిలో జరిగే సంకల్ప దీక్షలో ఉద్యోగులు ఉపాధ్యాయులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ సారధి కార్యదర్శి నివేదిక ప్రవేశ పెడుతూ ఇటీవల జరిగిన పదోన్నతులకు సంబంధించి స్పష్టమైన ఉత్తర్వులు, ప్రమోషన్ స్కేలు ఇవ్వకుండా కేవలం 2500 బత్యం ఇవ్వడం సరికాదన్నారు. కోర్టు కేసులకు కౌంటర్ దాఖలు చేసి బదిలీలు జరపాల్సి ఉండగా పని సర్దిబాటు పేరిట ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయటం మితిమీరిన రాజకీయ జోక్యంతో అర్హులైన ఉపాధ్యాయులకు సరైన ఖాళీలు దొరకక ఆవేదనకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో పనిచేస్తూ గుంటూరు మంగళగిరి ప్రాంతాల్లో నివాసం ఉంటున్న అనేకమంది ఉపాధ్యాయులు పైరవీ బదిలీలపై పని సర్దుబాటులో నిబంధనలకు విరుద్ధంగా వెళ్లడంతో సబ్జెక్టు టీచర్ల కొరతతో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు.

పల్నాడు ప్రాంతంలో 30 యుటి ఎఫ్ శాఖల నిర్మాణాలను ఫిబ్రవరి 10వ తేదీ నాటికి పూర్తి చేయాలని కోరారు. మండలాల నుండి సిపిఎస్ ఉపా ధ్యాయులు సంకల్ప దీక్షలో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. శ్రీనివాస్ రెడ్డి, సహాధ్యక్షులు ఎన్ సుందరరావు, ఏ భాగేశ్వరి దేవి, కోశాధికారి జె.వాల్యా నాయక్, జిల్లా కార్యదర్శి ఎం మోహన్ రావు, కె.ఉషా సౌరీ రాణి, యు రాజశేఖర్, సిపిఎస్ జిల్లా కమిటీ కన్వీనర్ టి అరుణ్ కుమార్, వి నాగేశ్వరరావు డి కాంతారావు ఏ.నాసర రెడ్డి, షేక్ అయేషా సుల్తానా, కె. తిరుపతి స్వామి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఈ నెల 3వ తేదీన గన్నవరం లోని ధర్మస్థల వద్ద సంకల్ప దీక్షకు ఐక్య ఉపా ధ్యాయ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ (ఎపియుటిఎఫ్) పిలుపులో భాగంగా బుధవారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసులు రెడ్డి మాట్లా డుతూ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడిచిన ఇంతవరకు సిపిఎస్ రద్దు చేయకుండా దాని బదులుగా జిపిఎస్ అనే కొత్త విధానాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. దీంతో ఉద్యోగులకు పెద్ద లాభమేమి ఉండదని, పాత పెన్షన్ విధానాన్నే ఉద్యోగులు కోరుకుంటున్నారని అనానరు. ముఖ్య మంత్రి ఇచ్చి న హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.తిరుపతిస్వామి, మండల ప్రధాన కార్యదర్శి శంషుద్దీన్, మండల గౌరవాధ్యక్షులు, మండల బాధ్యులు ఎస్కె నాగూర్‌షావలి పాల్గొన్నారు.



సంక్షోభంలో రాష్ట్ర రోడ్డు రవాణా వ్యవస్థ

- పెంచిన రోడ్డు ట్యాక్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలి
- జిఒ 21ను రద్దు చేయాలి
- రవాణా రంగ కార్మికుల సమావేశంలో సిఐటియు



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ,తదితరులు

ప్రజాశక్తి-పెదనందిపాడు

రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో రాష్ట్ర రోడ్డు రవాణా వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయిందని ఆటో డ్రైవర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ, సిఐటియు జిల్లా కార్యదర్శి బి. లక్ష్మణరావు, జిల్లా నాయకులు కాకుమాను నాగేశ్వరరావు అన్నారు. బుధవారం గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) పెదనందిపాడు మండల సమావేశం పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్లో జరిగింది. సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రవాణా రంగం నేడు తీవ్ర సంక్షోభంలో ఉందని, పెట్రోల్, డీజిల్ , గ్యాస్‌లపై అధిక వ్యాట్ విధిస్తూ తీవ్రమైన భారాలను మోపుతున్నారని, గ్రీన్ టాక్స్‌ను భారీగా పెంచి పెనుభారాలను మోపారు అని తెలిపారు. మన రాష్ట్రంలో వసూలు చేసిన రవాణా పన్నులు ఇరుగుపొరుగు రాష్ట్రాలతో పోల్చితే చాలా ఎక్కువగా ఉన్నాయని, కోవిడ్ సమయంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు, ఆయా త్రైమాసికాల్లో పన్ను రద్దు చేయగా ఇక్కడ మాత్రం ముక్కు పిండి వసూలు చేశారని తెలిపారు. పొరుగు రాష్ట్రాల్లో 200 రూపాయల వసూలు చేసే గ్రీన్ టాక్స్ ఎక్కడ 20,000గా ఉందంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు, దేశమంతటా ఒకే మార్కెట్‌గా రూపొందుతున్న ఈ రోజుల్లో రాష్ట్ర రవాణా రంగం ఇతర రాష్ట్రాలతో పోటీ పడలేక పోతున్న దుస్థితి నెలకొందన్నారు, మరోవైపు రోడ్ల మరమ్మతులు లేనందున వాహనాలకు మెయింటినెన్స్ ఖర్చు విపరీతంగా పెరిగిపోయిందని తెలిపారు. ఆర్థిక మాంద్యం ముందుకు వస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకున్న ఈ ఉపాధి కూడా దెబ్బతింటే ఎలా బ్రతకాలి అని ప్రశ్నించారు. రవాణా రంగంలో సర్కారుకు ఆదాయం సమృద్ధిగా లభిస్తుందని, కేవలం పన్నుల రూపేనే గాక, రవాణా శాఖ ఫైన్ లు వంటి వాటి ద్వారా ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం లభిస్తుంది అన్నారు. ఇటువంటి రవాణా రంగంపై ఇంకా అధికంగా పన్నులు పెంచి సంక్షోభంలోకి నెట్టటం సరైన చర్య కాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచిన రోడ్డు టాక్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని, పెట్రోలు, డీజిల్, గ్యాస్‌లపై పన్నుల భారం తగ్గించాలని, భారీ మొత్తంలో వసూలు చేస్తున్న గ్రీన్ టాక్స్ కూడా తగ్గించాలని, అదేవిధంగా రవాణా రంగానికి తీవ్ర నష్టం చేకూరుస్తున్న జీవో నెంబర్ 21ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, కొత్త వెంకటశివరావు, చుక్కా యానాదులు, రామరాజు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్

మలినేనిలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో

ప్రజాశక్తి-గుంటూరు: మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కాలేజిలో ఈసీఈ విభాగంలో ఐఇటిఇ స్టూడెంట్ డే ఐఎస్‌ఎఫ్ ఫోరం సహకారంతో బుధవారం ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ ఎక్స్‌పోను కళాశాల ఛైర్మన్ డాక్టర్ యం.పెరుమాళ్ళు, ఐఇటిఇ ఛైర్మన్ డాక్టర్ బి.రాజశేఖర్ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులకు బెస్ట్ ప్రాజెక్టులను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందచేశారు. ఐఇటిఇ ట్రెజరర్ డాక్టర్ సూర్యప్రసాద్, ఈసీ సభ్యులు షేక్.రియాజుద్దీన్, ప్రిన్సిపాల్ జె.అప్పారావు, డైరెక్టర్ పి.నాగేశ్వరరావు,డాక్టర్ కె.గౌతమి పాల్గొన్నారు.

గణాంకాలపై ఫార్మసీ విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు: స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజిలో గణాంక ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యవక్తగా స్థానిక వి-కాన్నిగర్ ఎస్ఎఎస్ శిక్షణా సంస్థ అధినేత డాక్టర్ వెంకట్ ఇక్కుర్తి పాల్గొని మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు స్టాటిస్టికల్ ప్రోగ్రాంతో శిక్షణ పొందిన వారికి జాతీయ, బహుళజాతి ఔషధ సంస్థల్లో ఉత్తమ ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. నూతన ఔషధాల తయారు, ప్రీ క్లినికల్, క్లినికల్ ట్రయల్స్‌లో సాధించిన ఫలితాలను ఔషధ నియంత్రణ సంస్థలకు సమర్పించటానికి స్టాటిస్టికల్ ప్రోగ్రామ్స్ ఉపయోగపడతాయని చెప్పారు. ఈ సందర్భంగా వెంకట్‌ను కళాశాల యాజమాన్యం సన్మానించింది.



సదస్సులో మాట్లాడుతున్న ఇక్కుర్తి వెంకట్

కార్యక్రమంలో ఛైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి మధుసూదనరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మా డి.డైరెక్టర్ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌కు ఎన్‌పిటిఇఎల్ 'ఎఎ' గ్రేడ్

ప్రజాశక్తి-గుంటూరు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి ఐఐటీ మద్రాస్ విడుదల చేసిన జాతీయస్థాయి స్వయం ఎన్‌పీటీఈఎల్ ర్యాంకింగ్స్‌లో 'ఏఏ గ్రేడ్' లభించిందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. 'ఏఏ గ్రేడ్'కు సంబంధించిన సర్టిఫికెట్‌ను ఐఐటీ మద్రాస్‌కు సంబంధించిన నిర్వాహకులు విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ప్లానింగ్ అండ్ మోనిటరింగ్ డీన్, ఎన్‌పీటీఈఎల్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ షేక్ జాకీర్ హుస్సేన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ స్వయం ఎన్‌పీటీఈఎల్ విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో జాతీయస్థాయిలో 22వ ర్యాంక్ సాధించి 'ఏఏ గ్రేడ్'ను సొంతం చేసుకుందన్నారు.ఎన్‌పీటీఈఎల్ నిర్వహించిన వివిధ రకాల



సర్టిఫికెట్ అందుకుంటున్న వర్సిటీ డీన్

కోర్సులలో విజ్ఞాన్స్ యూనివర్సిటీకు చెందిన విద్యార్థులు పాల్గొని 1919 కోర్సు సర్టిఫికెట్లు సాధించారన్నారు. వీటిలో 42 మందికి టాపర్స్, 22 గోల్డ్, 229 సిల్వర్, 775 ఎలైట్, 893 మంది సాధారణ ఉత్తీర్ణత సర్టిఫికెట్స్ పొందారన్నారు. వీటితో పాటు గరిష్టంగా ఎక్కువ మంది డొమైన్ స్కాలర్స్ కలిగిన యూనివర్సిటీగా కూడా గుర్తింపు పొందిందన్నారు. అధ్యాపక బృందానికి విజ్ఞాన్స్ ఛైర్మన్ డాక్టర్ లావురత్తయ్య, వీసీ, రిజిస్ట్రార్ రఘునాథన్, డీన్లు అభినందనలు తెలిపారు.

ముగిసిన కెఎల్ స్మారక ట్రోఫీ క్రీడలు

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో ప్రాముఖ్యమని ఎపి అడ్వెంచర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ తరుణ్ కాకాని అన్నారు. బుధవారం కెఎల్ విశ్వవిద్యాలయంలో జరిగిన కోనేరు లక్ష్మయ్య స్మారక ట్రోఫీ 2023 క్రీడలు ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి వ్యవహారాల విభాగ అధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు సభకు అధ్యక్షత వహించి అధ్యక్షోపన్యాసం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి ఆయా విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్ కళాశాలల నుండి సుమారు 75 జట్లు, 904 మంది క్రీడాకారులు పాల్గొన్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి 57, తెలంగాణా నుండి 7, తమిళనాడు నుండి 4, కర్నాటక నుండి1 జట్లు పాల్గొన్నట్లు కెఎల్ యు క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ హరికిషోర్ తెలిపారు. వాటి వివరాలిలా ఉన్నాయి. బ్యాడ్మింటన్ మహిళల విభాగం సింగిల్‌లో ప్రథమ బహుమతి ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం చెన్నైకు చెందిన ఎం.నివేథ, ద్వితీయ బహుమతి కెఎల్ విశ్వవిద్యాలయం నుండి పాలడుగు కీర్తిక, తృతీయ బహుమతి కేఎల్‌యు విశ్వవిద్యాలయం నుండి పులివర్తి



బహుమతులను చూపుతున్న క్రీడాకారులు

విన్సీ గెలుచుకున్నారు. బాయడ్మింటన్ పురుషుల విభాగం సింగిల్‌లో ప్రథమ బహుమతి ఎస్ఆర్ఎం, ఐఎస్‌టి నుండి శబరీశ్వరం, ద్వితీయ బహుమతి కెఎల్ విశ్వవిద్యాలయం వడ్డేశ్వరం నుండి టి.విశ్వనాధ్ బాలు, తృతీయ బహుమతి ఎస్ఆర్ఎం, ఐఎస్‌టికి చెందిన వైఎస్ఎస్.సర్వేష్‌లు గెలుచుకున్నారు. బాయడ్మింటన్ పురుషుల విభాగం డబుల్స్‌లో ప్రథమ బహుమతి ఎస్ఆర్ఎం, ఐఎస్‌టి చెన్నైకు చెందిన వై.ఎస్.ఎస్.సర్వేష్‌లు, డి.నిషాంత్, ద్వితీయ బహుమతి కెఎల్ విశ్వవిద్యాలయం వడ్డేశ్వరంకు చెందిన టి.యశ్వంత్ బాలు, కుమార్ మిశ్రా అర్పిత్, తృతీయ బహుమతి నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎస్.తనుష్ ,సిహెచ్.ప్రసాద్‌లు గెలుచుకున్నారు. వాలీబాల్ పురుషుల విభాగంలో ప్రథమ బహుమతి సత్యబామ విశ్వవిద్యాలయం చెన్నై, ద్వితీయ బహుమతి కెఎల్ విశ్వవిద్యాలయం వడ్డేశ్వరం, తృతీయ బహుమతి నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలు గెలుచుకున్నాయి. ఖో ఖో మహిళా విభాగంలో ప్రథమ బహుమతి కెఎల్ విశ్వవిద్యాలయం వడ్డేశ్వరం, ద్వితీయ విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, తృతీయ బహుమతి విజ్ఞాన్ నీరుల గెలుచుకున్నాయి. ఖో ఖో పురుషుల విభాగంలో ప్రథమ బహుమతి కెఎల్ విశ్వవిద్యాలయం వడ్డేశ్వరం, ద్వితీయ బహుమతి విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, తృతీయ బహుమతి కెఎల్ విశ్వవిద్యాలయం వడ్డేశ్వరం సాధించాయి.కబడ్డీలో ప్రథమ బహుమతి కెఎల్ విశ్వవిద్యాలయం వడ్డేశ్వరం, ద్వితీయ బహుమతి వివేకానంద ఇంజనీరింగ్ కళాశాల హైదరాబాదు, తృతీయ బహుమతి మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాదులు గెలుచుకున్నాయి. హ్యాండ్ బాల్ పోటీలో ప్రథమ బహుమతి హేలాపూరి ఆఫ్ టెక్నాలజీ ఏలూరు, ద్వితీయ బహుమతి కెఎల్ విశ్వవిద్యాలయం వడ్డేశ్వరం, తతీయ బహుమతి సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఏలూరులు గెలుచుకున్నాయి. గెలుపొందిన విజేతలకు ఏపి అడ్వెంచర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ తరుణ్ కాకాని చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రో వైస్ చాన్సులర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విద్యార్థి వ్యవహారాల డీన్ హనుమంతరావులు పాల్గొన్నారు.



రేపటి సంకల్ప దీక్షను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి

ఈనెల 3వ తేదీన యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగే సంకల్ప దీక్షను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ ఆదినారాయణ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం మంగళగిరి పెన్షనర్స్ హాల్లో సంకల్ప యాత్రకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్ సమావేశాల్లో జిపిఎస్ తీసుకురావాలని చూస్తుందని విమర్శించారు. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని ఓపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీని కోసం జరిగే సంకల్పదీక్షలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏ శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి సిహెచ్ శివ సత్యనారాయణ, యుటిఎఫ్ నాయకులు టి ఆంజనేయులు, టి భాస్కరరావు, వి పేర్రాజు వి ప్రసాద్, ఎం సతీష్, ఎన్ సుజాత కుమారి, కే రవిబాబు, ఎస్ కే జానీ భాష, పి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ సాంబిరెడ్డి తదితరులు

11, 12 తేదీల్లో బాలోత్సవం

ప్రజాశక్తి-తెనాలి

విద్యార్థుల్లో మేథాశక్తికి పదును పెట్టేందుకు, వారిలో ఉత్సాహాన్ని నింపేందుకు ఈనెల 11, 12 తేదీల్లో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి చెప్పారు. స్థానిక దీప్తి పబ్లికేషన్స్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో సాంబిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉండే ఉత్సవంలో పాల్గొనేందుకు వారిని ప్రోత్సహించాలన్నారు. గుంటూరు లక్ష్మీపురంలోని ఎన్‌టిఆర్ స్టేడియం పక్కనే ఉన్న పాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల్లో ఉత్సవాలు జరుగు తాయన్నారు. ఆహ్వాన కమిటి ఛైర్మన్‌గా విజ్ఞాన్ విధ్యాసంస్థల అధినేత డాక్టర్ ఎల్.రత్తయ్య, అధ్యక్షులుగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. బాలోత్సవ కమిటీ బృందం డాక్టర్ ఎ.ఆంజనేయులు, ఎస్‌కె అహ్మద్ హుస్సేన్, ఎల్.వేణుగోపాల్ పాల్గొన్నారు.



కరాటేలో ఎల్‌ఎం పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్: ఇటీవల హైదరాబాదులో ఎం జె గార్డెన్లో జరిగిన అండర్ -14 కరాటే ఆన్ లైన్ కరాటే పోటీలలో పెదనందిపాడు లయన్స్ మాంటిసోరీ పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు ఆన్ లైన్ కరాటే ప్రదర్శనలో పాల్గొనగా 8 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 5మంది విద్యార్థులకు వెండి పతకాలు ఇద్దరికి కాంస్య పతకాలు చొప్పున మొత్తం 15 పత కాలు సాధించి తమ పాఠశాలకు వన్నె తెచ్చారు ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో గెలుపొందిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఎం. నగరాజకుమారి, పాఠశాల ప్రిన్సిపల్ కిరణ్ జోషి, కరాటే ఉపాధ్యాయుడు కె. రాంబాబు, ఉపాధ్యాయులు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు



గర్భిణుల సత్వర నమోదు కార్యక్రమం

ప్రజాశక్తి - గురజాల

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ గురజాల పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో కమ్యూనిటీ బేస్ ఈవెంట్ కార్యక్రమంలో గర్భిణుల సత్వర నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు, సూపర్‌వైజర్ రత్నకుమారి మాట్లాడుతూ నమోదైన గర్భిణి ఎత్తు, బరువు తెలుసుకొని అంగన్వాడి కేంద్రంలో పెట్టే భోజనం చేయాలని, వారు రక్తహీనత బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతినెలా ఇచ్చే వైఎస్ఆర్ కిట్ తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జె.ఉమా, ఎస్.రాణి, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతకు సహకరించాలి

ప్రజాశక్తి-మాచర్ల

నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం తప్పనిసరి అని జడ్పి బాలికల పాఠశాల హెచ్ఎం ఐవి నాగమణి స్పష్టం చేశారు. పాఠశాల ఆవరణలో బుధవారం ఉదయం పేరెంట్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ ఇళ్ళ వద్ద విద్యార్థులు సెల్ ఫోను, టివిలు చూడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థులు ఆరోగ్యంగా, ప్రశాంతంగా ఉండేలా తల్లిదండ్రులు చూడాలని అన్నారు. అదనపు తరగతకులకు విద్యార్థులను పంపించాల్సిందిగా కోరారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి, భవి ష్యత్‌పై ఆలోచన గురించి వివరించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అప్పుడు విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తారని, నూరు శాతం ఉత్తీర్ధన లభిస్తుందని వివరించారు.

గిరిజన గురుకులాల్లో
ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-మాచర్ల



ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్దతిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు రెంటచింతల ఎపి టీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాల కన్వీనర్ ప్రిన్సిపాల్ మోహన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టు లను భర్తీ చేసేందుకు ఐటీడీఏ శ్రీశైలం పిఓ అదేశించినట్లు తెలిపారు. ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులకు బీఈడీ లో 50 శాతం ఉత్తీర్ణత ఉండాలని, ఎపి టెట్ క్వాలిఫై అయి ఉండాలని చెప్పారు. అభ్యర్థులు తప్పనిసరిగా టూ స్టెప్స్‌లో ఇంగ్లీషు మీడియం చదివి ఉండాలని అన్నారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌కు దరఖాస్తు చేసే అభ్యర్థులు ఇంటర్మీడియట్‌లో టిడిసి ఉత్తీర్ణత, పిఇటికి దరఖాస్తు చేసుకునే వారు బిపిఇడి ఉత్తీర్ణత ఉండాలని చెప్పారు. టిజిటి సోషల్ స్టడీ మహిళల అభ్యర్థి 1, పిజిటి ఫిజికల్ సైన్స్ 1, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ 2, ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.దరఖాస్తులు కన్వీనర్ ప్రిన్సిపాల్, ఎపిటిడబ్ల్యూఆర్ఎస్ పాఠశాల,రెంటచింతల చిరునామాకు పోస్ట్ ద్వారా లేదా స్వయంగా అందజేయాలని సూచించారు.మరిన్ని వివరాల కోసం 9441265302 నంబర్‌లో సంప్రదించాలని అన్నారు.



నిర్మాణంలో ఉన్న గదులను పరిశీలిస్తున్న వినుకొండ ఆసుపత్రి సూపరింటెండెంట్ తదితరులు

వంద పడకలతో వైద్య సేవలు విస్తృతం

ప్రజాశక్తి-నరసరావుపేట

వినుకొండ 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చడం ద్వారా వైద్య సేవలు విస్తృత పరిచేందుకు అవకాశం ఉంటుందని హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బుచ్చిబాబు అన్నారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటి సమావేశం జరిగింది. అనంతరం నాడు-నేడులో నిర్మాణమవుతున్న, క్యాజువాలిటి, ఆపరేషన్ థియేటర్, అల్ట్రాసౌండ్, డాక్టర్ రూమ్స్‌ను సందర్శించారు. వంద పడకల ఆసుపత్రిగా మార డం వల్ల పేద,మధ్య తరగతి వారికి మెరుగైన వైద్యం అందుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు, కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైద్యశాల అభివృద్ధి కమిటి మాజీ చైర్మన్, ఎజిపి సీనియర్ న్యాయవాది ఎమ్.ఎన్ ప్రసాద్, వినుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు, వైద్యశాల డైరెక్టర్ ఆర్.సామ్రాజ్యం, కొత్తమాసు శివ,కౌన్సిలర్ గౌస్ బాషా పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న అదనపు ఎస్పీ బిందు మాధవ్

పోలీస్ మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నరసరావుపేట

పోలీస్ కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అదనపు జి.బిందు మాధవ్ అన్నారు. పల్నాడు జిల్లాలో పోలీస్ శాఖలో పని చేస్తూ అనా రోగ్యంతో, వివిధ ప్రమాదాలలో మృతి చెందిన కాని స్టేబుళ్ల కుటుంబ సభ్యులకు చేయూత పథకం కింద రూ.1 లక్ష నగ దు చెక్కులను జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) జి. బిందు మాధవ్ బుధవారం అంద జేశారు. గత ఏడాది నవంబర్ 28 న కానిస్టేబుల్ దేవరకొండ శ్రీకాంత్, బాపట్ల జిల్లా ఈపూరుపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అతని భార్య దేవరకొండ సత్యవతికి అదేరోజు నరసరావుపేట 2వ పట్టణ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పనిచేస్తూ అనా రోగ్యంతో మృతి చెందిన గంగవరపు ప్రశాంత్ కుమార్, భార్య ఝాన్సికి చేయూత పథకం కింద అదనపు ఎస్పీ ఒక్కొరికి రూ 1 లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. పోలీస్ కార్యాలయం ఏ.ఏ.ఓ కెవిడి రామారావు, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.మాణిక్యాలరావు పాల్గొన్నారు.



విశ్వనరుడు గుర్రం జాషువా డైరీని ఆవిష్కరిస్తు మంత్రి అంబటి రాంబాబు

గుర్రం జాషువా డైరీ, కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సత్తెనపల్లిటౌన్

కవి కోకిల గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన విశ్వ నరుడు గుర్రం జాషువ డైరీని మంత్రి అంబటి రాంబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాడు కుల వ్యవస్థపై జాషువా తన కవితలతో విరుచుకు పడారని, తన రచనలతో సమాజాన్ని చైతన్య పరచడంలో ఆయన ఏనాడు రాజీపడ లేదన్నారు. అద్భుతమైన కవితా సంపదను ఇచ్చి విశ్వనరుడిగా జాషువా గుర్తింపు పొందారని కొనియాడారు. పల్నాడు జిల్లా పేరును గుర్రం జాషువా పల్నాడు జిల్లాగా మార్చేందుకు మంత్రి కృషి చేయాలని మంత్రికి ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు అధ్యక్షులు పిఇర్మియా, ఎఎన్ఆర్ జక్కం, సురేష్, అనిల్, ప్రశాంతరాజు, జాన్ బాబు పాల్గొన్నారు.

గృహ సారధులతో మంత్రి సమావేశం

ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేస్తే రానున్న ఎన్నికల్లో మళ్లీ అధికారం మనదే అవుతుందని అంబటి రాంబాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సచివాలయ కన్వీనర్లు , గృహ సారథులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ సచివాలయం కన్వీనర్లు , గృహ సారథులు సమన్వయంతో పని చేస్తే రాష్ట్రంలో మళ్లీ వైసిపి అధికారంలోకి వస్తుందని అభిప్రాయపడ్డారు. .ఇప్పటి నుండే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని వారికి దిశానిర్దేశం చేశారు. ప్రతి నియోజకవర్గంలో గర్వంగా చెప్పుకునేలా ప్రభుత్వం పనితీరు ఉందన్నారు. తాను నియోజకవర్గంలో తెలిసి ఏ తప్పు చేయలేదని, వైసిపిపై ఈగ వాలినా ముందుగా స్పందించేది తానేనని అన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

'చెప్పిన మాటకు సిఎం కట్టుబడాలి'

ప్రజాశక్తి-నరసరావుపేట

వైసిపి అధికారంలోకి వస్తే రాజధాని మార్పు చేస్తారని అప్పటి ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు అప్పుడే చెప్పారని తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాటా్లడుతూ నాడు ప్రతిపక్ష నేత హోదాలో అమరావతి రాజధానికి మద్దతు తెలిఎన జగన్, అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానులంటూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు. ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని, రాష్ట్రాన్ని మళ్లీ విభజన చేయాలని ప్రయత్నిస్తున్నారంటూ మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వంపైన, వారి కుటుంబంపైన లేదా ఆయనపైగాని ఏవైనా విమర్శలు వచ్చినప్పుడు వాటిని పక్కదారి పట్టించేందుకు రాజధాని అంశాన్ని తెర పైకి తీసుకొస్తు న్నారని విమర్శించారు. విశాఖ వాసులు వారి స్థలాలను కాపాడుకోవడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను తనఖా పెట్టుకోవడానికి, అమ్ముకోవడానికి విశాఖ పట్నంకు రాజధానిని మార్చాలని చూస్తున్నాంని ఆరోపించారు. రాజ్యాంగంపై ముఖ్యమంత్రికి ఏమాత్రం విశ్వాసం ఉన్నా చెప్పిన మాటకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు.



జెసికి ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు చదలవాడ అరవిందబాబు

అమరా కుటుంబానికి న్యాయం చేయాలి: టిడిపి

ప్రజాశక్తి-నరసరావుపేట

అమరా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అమరా వెంకటేశ్వర రావు ఆత్మ హత్యకు కారణమైన కెనరా బ్యాంక్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. కెనరా బ్యాంక్ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరా వెంకటేశ్వర రావు మృతికి సంబంధించి అధికార పార్టీ నాయకులు ఎందుకు భుజాలు తడుము కుం టున్నారో తమకు అర్థం కావడం లేదన్నారు. తమ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అమరా వెంకటేశ్వర రావు కుటుంబానికి అండగా నిలిచేందుకు మాత్రమే తాము ముందుకు వచ్చామన్నారు. వ్యక్తిగతంగా ఎవరిపైనా ఆరోపణలు చేయ లేదన్నారు. అమరా వెంకటేశ్వరరావు భార్య సోషల్ మీడియాలో ప్రకటన చేయడంతో చంద్రబాబు స్పందించి వారికి అండగా నిల వాలని తమకు సూచించారని తెలిపారు. వైసిపి నాయకులు నియోజకవర్గంలో చేస్తున్న అవినీతి అంతా ఇంతా కాదని, దుర్మార్గలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్న పేదలు

ప్రజాశక్తి-నరసరావుపేట

రాష్ట్రంలో వైపీసీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పేదలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని టిడిపి పాలన కోసం ఎదురుచూస్తున్నారని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ బాధ్యులు డాక్టర్ చదల వాడ అరవింద బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని 11 వార్డ్ నందు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి" అంటూ ఫ్లెక్సీలతో ర్యాలీ నిర్వహించారు.డాక్టర్ చదలవాడ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో అవినీతి పాలన జరుగుతుందని వైసిపి నేతలు దోచుకోవడం మినహా ప్రజలకు ఓరిగిందేమి లేదన్నారు.కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన వైసిపి సాకులతో పింఛన్లు తొలగించే ప్రయత్నం చేస్తున్నారని సంబంధంలేని విషయాలను వారికి ఆపాదించి నోటీసులు పంపుతున్నారన్నారు.



ఆర్‌టిసి డిపోలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆర్‌టిసి డోపోలో రక్తదాన శిభిరం ఏర్పాటు చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ ఐజె ప్రసాద్ మాట్లాడుతూ సురక్షిత ప్రయాణానికి ఆర్‌టిసి చిరునామాగా ఉందన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది కూడా ప్రయాణీకులకు భరోసా కల్పించాలని, రవాణా శాఖ నిబంధనలు పాటించాలన్నారు. రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.శారమ్మ, అభిరామ్‌నాయక్, రెడ్‌క్రాస్ కార్యదర్శి ఎం.భానుమతి, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణా కేంద్రాన్ని ప్రారంబిస్తున్న ఎ.భూలక్ష్మీ తదితరులు

కుట్టుమిషన్ శిక్షణా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి

మహిళల జీవనోపాధి పెంపు లక్ష్యంగా తాడేపల్లి పట్టణంలో బుధవారం స్త్రీ శక్తి కార్యక్రమంలో భాగంగా ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఎ.భూలక్ష్మి, రాష్ట్ర అధికార ప్రతినిధి టి.జానకీదేవి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఎ.జయసత్య ప్రారంభించారు. ఇందులో 60 మందికి రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు కుట్టు మిషన్ కూడా అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో దుగ్గిరాల మండల పార్టీ అధ్యక్షులు కె.శ్రీఅనిత, ఎ.కుసుమ, ఎస్ కె నూర్జహాన్, ఎ.శైలజ పాల్గొన్నారు.

బాలమృతం పంపిణీ

ప్రజాశక్తి-పెద్దకాకాని



బాలమృతం అందజేస్తున్న సూపర్‌వైజర్ వి. శ్రీదేవి

మండలంలోని నంబూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు రెండున్నర కేజీల బాలమృతం ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి. శ్రీదేవి తెలిపారు. బుధవారం గ్రామంలోని మూడు అంగన్వాడి కేంద్రాల పరిధిలో బాలమృతం పంపిణీని తనిఖీ చేసి మాట్లాడుతూ ప్రతి నెల బాలమృతం అందజేస్తామని తెలిపారు. బాలమృతంలో బలవర్ధకమైన ఆహారం ఉంటుందన్నారు. ప్రోటీన్లు క్యాల్షియం, రన్, విటమిన్ ఏబిసి, పోలిక్ యాసిడ్, జింక్,గోధుమ సెనగపప్పు, పంచదార పాలపొడిల మిశ్రమంతో తయారు చేస్తారని ఇది చిన్నారులకు మంచి బలాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ షేక్ షహనాజ్ బేగం, షేక్ రషీద్ ఉన్నిసా, మొహమ్మద్ ఫాతిమా బేగం తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాన్ని పర్యవేక్షించాలి



నూతన డ్రైన్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో నూతనంగా రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు విస్తృతంగా జరుగుతున్నాయని, పనుల్లో జాప్యంలేకుండా, నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని నగర కమిషనరు కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులిని ఆదేశించారు. బుధవారం కమిషనరు బాలాజీ నగర్‌లో రూ.25.8 లక్షలతో నిర్మాణం చేసిన సిసి రోడ్డు, డ్రైన్, రెడ్లబజార్, వినోభా నగర్, తమ్మా రంగారెడ్డి నగరాలనూ, రూ.28 లక్షలతో నిర్మించిన సిసి డ్రైన్లు, పాత గుంటూరులో కాపు కమ్యూనిటీ హాల్లో రూ.20 లక్షలతో పూర్తి చేసిన పనులనూ పరిశీలించి, నాణ్యత, కొలతలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమినిటీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్లు పోలవరపు జ్యోతి, ఇర్రి ధనలక్ష్మి, మహమూద్, ఎస్.ఈ. భాస్కర్, ఈ.ఈ. కోటేశ్వరరావు, డి.ఈ.ఈ. కళ్యాణరావు, ఏసిపి కాలేష, టి.పిఎస్. రసూల్, ఏ.ఈ. సేతుబాబు, శానిటరీ సూపర్వైజర్ ఆయుబ్ ఖాన్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఐజాక్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

యూరియా అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చేబ్రోలు

యూరియాను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని పొన్నూరు ఏడిఏ సిహెచ్ తిరమలదేవి అన్నారు. బుధవారం మండలంలోని యూరియా డీలర్ షాపులను, మన గ్రోమోర్, సొసైటీలను ఆమె సందర్శించి సందర్శించి పరిశీలించారు. మండలంలో యూరియా కొరత లేదని,రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని తెలిపారు. నారాకోడూరు పరిధిలో యూడియా డీలర్‌ల షాపులను పరిశీలించారు. సొసైటీలో,మన గ్రోమోర్‌లో 100 టన్నులకు పైగా యూరియా లభ్యత మండలంలో ఉందని తెలిపారు. మండలంలో పంట నమోదు వివరాలను పరిశీలించి నమోదు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులు తప్పనిసరిగా ఈ- కేవైసీ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె సునీత, గ్రామ వ్యవసాయ సహాయకులు శివసత్యం బాబు , షబీనా,గ్రామ రైతులు పాల్గొన్నారు.



యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడిఏ తిరుమలదేవి



కేలండర్‌ఆవిష్కరిస్తున్న ఈఓ అన్నరెడ్డి రాంకోటిరెడ్డి

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- మంగళగిరి

మంగళగిరి శివాలయంలో బుక్లెట్ ఆవిష్కరణ, కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా శివాలయం ఈవో అన్నపరెడ్డి రాంకోటి రెడ్డి, ట్రస్టు చైర్మన్ వాకా మంగారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వర స్వామి అన్నదానం ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో స్వామివారి రథోత్సవం రోజున అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం. వెంకటేశ్వర రావు, వి. వెంకయ్య చౌదరి, డి.శ్రీనివాసరావు, బి.కోటయ్య, టి. నాగార్జున, ఎం. వెంకటదుర్గారావు, జి.సత్యనారాయణ, కటారి వెంకటేశ్వరావు,బి. గురవయ్య, జి.గురుచంద్రరావు, కె. శివాజీ, జి. చెన్నకేశవ, ఎ. శీను, తదితరులు ఆవిష్కరణలో పాల్గొన్నారు.

అక్రమ రేషన్ మాఫియాకు అడ్డేలేదు : టిడిపి

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్



రాష్ట్రంలో అన్ని దిక్కులా రేషన్ మాఫియా విస్తరణ చేశారని,రేషన్ మాఫియా అక్రమాలకు అడ్డులేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే దూళ్లిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నేడు ఆర్‌టిసిని కూడా రేషన్ మాఫియాకి ఉపయోగించటం సిగ్గు చేటన్నారు. ఆదివారం ఆముదాల వలస శ్రీకాకుళం మధ్యలో అక్రమ రేషన్ బియ్యంతో అధికారులకు చిక్కిన ఆర్‌టిసి కార్గో వాహనం జగన్ రేషన్ మాఫియా అక్రమాలకు నిదర్శనమని ధూళిపాళ్ళ నరేంద్ర ఆరోపించారు. వైసిపి ప్రభుత్వంలో ప్రజా రవాణా వ్యవస్థను కూడా నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.

పేదలకు ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - ఫిరంగిపురం

స్థానిక మండలంలోని బేతపూడి హరిదాసుల కాలనీలో హైదరాబాద్ మిషన్ హెల్పింగ్ హాండ్స్ దాసు ఆఫీసర్స్ గ్రూపు వారు ఇంటర్ చదువుతున్న పదిమంది విద్యార్థులకు బుధవారం ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అలాగే గుండాలపాడు అగ్రహారం దాసులకాలనీలో 40 మంది వృద్ధులకు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బేతపూడిలో ముగ్గురు వికలాంగులకు ఒక్కొక్కరికి రూ.5వేలు అందజేశారు. దారా భూలక్ష్మికి మూడు చక్రాల బండిని అందజేశారు. క్రోసూరు మండలం గుడిపాడులో 5 మంది విద్యార్థులకు రూ. 10వేలు అందజేశారు. 30 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. నాదెండ్ల మండలం కనపర్రులో ముగ్గురు వికలాంగులకు రూ. 10వేలు పదివేలు, 45మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వివిధ గ్రామాలలో 27 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున అందజేశారు. కోవిడ్ సోకిన వారికి 5మందికి రూ.10వేలు, వికలాంగులకు ఐదు మందికి రూ. 5వేలు చొప్పున అందజేశారు. కిడ్నీ పేషెంట్లకు పదిమందికి రూ.5వేలు , ఒంటరి మహిళలకు 5 మందికి రూ. 5వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఆపదలో ఆదుకుని తమ వంతు సహాయం చేసిన హైదరాబాద్ మిషన్ హెల్పింగ్ హాండ్స్ దాసు ఆఫీసర్స్ గ్రూపు వారికి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీధిటిఆర్ నెహ్రూ తాళ్లూరి నరసింహారావు, చెవుల నాగరాజు, దారా నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.



దారా భూలక్ష్మీకి ట్రైసైకిల్‌ను అందజేస్తున్న గ్రూప్ సభ్యులు



దాసును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ప్రముఖ హార్మోనిస్ట్ దాస్‌కు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో బుధవారం ఎన్టీఆర్ నటించిన పవిత్ర హృదయాలు చిత్రాన్ని ప్రదర్శించారు. అలాగే కళాకారుల సత్కారాల్లో భాగంగా రూరల్ గ్రామం కొలకలూరుకు చెందిన ప్రముఖ హార్మోనిస్ట్, రేడియో, టివి కళాకారుడు అల్లడి దాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో క్రీస్తు మణెమ్మ, మాతంగి భాస్కరరరావు, యార్లగడ్డ సత్యనారాయణ, రమావత్ నందారావు, వై.మాణిక్యరావు, అల్లడి బాబ్జి, పి.పోతురాజు, అయినాల మల్లేశ్వరరావు, ఎం.రాఘవరావు, జగన్, జి.ప్రసాద్ పాల్గొన్నారు.



కోలాటాన్ని ప్రదర్శిస్తున్న యాపిల్ స్కూల్ విద్యార్థినిలు

షిరిడి సాయిబాబా వార్షికోత్సవం

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని పేరేచర్ల సత్తనపల్లి రోడ్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ 17వ వార్షికోత్సవ వేడుక బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం 10 గంటలకు ప్రత్యేక విఘ్నేశ్వర పూజ, మండప ఆరాధన, అగ్ని ప్రతిష్ట, లక్ష్మీ గణపతి హెూమం, సాయి హెూమం, వాస్తు హెూమం, రుద్ర హెూమం, పూర్ణాహుతి, మంత్రపుష్పం, అభిషేకాలు, పౌరోహితుల నడుమ వేదమంత్రోచ్ఛారణతో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాములపాటి చంద్రయ్య ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆపిల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు ప్రత్యేక కోలాటం ప్రదర్శించారు. రాత్రికి సాయిబాబా దేవస్థానాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. అనంతరం అన్న సంతర్పణ జరిగింది.



గేరా మోహన్‌రావుకు సన్మానం

ప్రజాశక్తి-పెదనందిపాడు

పేద విద్యార్థుల విద్యాబివృద్ధి కోసం గేరా మోహన్ రావు విశేష సేవలను అందిస్తున్నారని కాకుమాను మండల విద్యాశాఖాధికారి కెఎఫ్ కెనడీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అప్పాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న గేరా రామోహన్‌రావు పదోన్నతిపై జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వింజనంపాడుకు బదిలీ అయిన సందర్భంగా ఆయనను తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. . ఈ కార్యక్రమంలో జె. సుబ్బారావు, మహమ్మద్ షహనాజ్ బేగం, ఉపాధ్యాయుని నర్ర వాణి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కంద్రు సద్గుణరావు, పి వెంకటేశ్వరరావు, వి అశోక్ కుమార్, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై ఇదీ అభిప్రాయం..

పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం ప్రవేశపెట్టిన 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై వివిధ రంగాలకు చెందిన వారు, రాజకీయ పార్టీల నాయకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ రాష్ట్రానికి ప్రయోజనకరంగా లేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


ఉపాధి కల్పనకు ప్రతిపాదనలు లేవు



ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలు అమలు చేయకుండా, బడ్జెట్లో నిధులు కేటాయించకుండా ఆంధ్రులకు కేంద్ర ప్రభుత్వం మరోసారి అన్యాయం చేసింది. విభజన హామీలు అమలు చేయడంపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగానికి పునరుజ్జీవం కల్పించడానికి తగిన చర్యలు బడ్జెట్‌లో ప్రతిపాదించలేదు. ఉపాధి కల్పన దిశగా బడ్జెట్ ప్రతిపాదనలు లేవు. విద్యా రంగంలో సార్వత్రిక విద్యకు తగిన విధంగా నిధులు కేటాయించలేదు.

కెఎస్.లక్ష్మణరావు, శాసన మండలి సభ్యులు, ఉమ్మడి కృష్ణా, గుంటూరు, జిల్లాల పట్టభద్రుల నియోజవకర్గం

విభజన హామీల ఊసేది?



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపారు. విభజన హమీల ఊసే లేదు. విశాఖ రైల్వే జోన్ అందని ద్రాక్షగా మారింది. పోలవరం నిర్వాసితులకు నిధులు కేటాయించలేదు. ఉపాధి హామీ చట్టాలనికి నిధుల కేటాయింపులు పెంచక పోవడమే కాక భారీగా కోతపెట్టారు. అంకెల గారడితో పేదలను మోసం చేసే బడ్జెట్ తప్ప మరేమీ కాదు. ఆదాయం పన్ను శ్లాబ్‌లను కొంత తగ్గించినా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిలు, గ్యాస్ ధరల భారం మధ్యతరగతి ప్రజలపై పడుతోంది.

గుంటూరు విజయ్‌కుమార్, సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి.

వైసిపి ఎంపీలు పట్టించుకోలేదు



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాలపై వైసిపి ఎంపిలు ఏమాత్రమూ పట్టించుకోలేదు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, రైల్వేజోన్, పోలవరం ప్రాజెక్టు కోసం వైసిపి ఎంపిలు కేంద్రంపై వత్తిడి తేలేకపోయారు. అందువల్ల రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాలు బడ్జెట్‌లో ప్రస్తావనకు కూడా నోచుకోలేదు. పోలవరం పూర్తి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు.

తెనాలి శ్రావణ్ కుమార్, టిడిపి గుంటూరు జిల్లా అధ్యక్షులు.

తృణ ధాన్యాలకు ప్రోత్సాహం



రైతులకు ఆశించిన మేరకు ప్రయోజనాలు రాలేదు. తృణ ధాన్యాలకు ప్రోత్సాహకాలు ఇవ్వడం ముదావాహం. ప్రకృతి వ్యవసాయనికి ఊతం ఇస్తామని చెప్పడం వల్ల రైతులకు కొంత వరకు పెట్టుబడులు తగ్గుతాయి. మారుతున్న ఆహారపు అలవాట్ల నేపథ్యంలో రాగులు, సజ్జలు, జొన్నలు తదితర పంటలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. వ్యవసాయ రంగంలో పెట్టుబడులు తగ్గింపునకు కేంద్రం తగిన ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

పులగం సురేష్‌రెడ్డి, మిర్చి వ్యాపారి, గుంటూరు.


మద్దతు ధరపై భరోసా ఏది?



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జిమ్ముకుల బడ్జెట్. వ్యవసాయ రంగం అభివృద్ధిలో ఉంటేనే మిగిలిన రంగాలు అభివృద్ధిలో ఉంటాయి. పంటలకు మద్దతు ధరలపై ఆర్థిక మంత్రి కనీస భరోసా ఇవ్వలేదు. దేశ వ్యాప్తంగా రైతులు, కౌలు రైతులు మద్దతు ధరల్లేక భారీగా నష్టపోతున్నారు. అప్పులు చేసి పంటలు పండించిన వీరు అయినకాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల నివారణ, ఎరువులు, పురుగు మందుల ధరల తగ్గింపుపై దృష్టి సారించలేదన్నారు.

కంచుమాటి అజయ్‌కుమార్, రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి.


రాష్ట్రానికి తగిన కేటాయింపుల్లేవు



బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన కేటాయింపులు లేవు. 25 మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్రం మెడలు వంచుతానని జగన్‌మోహన్‌రెడ్డి గతంలో చెప్పారు. ప్రజలు ఆ పార్టీకి చెందిన 22 మందిని ఎంపీలుగా గెలిపిస్తే రాష్ట్రానికి ఏం నిధులు తెచ్చారు? వేతన జీవులకు ఊరట కల్పించేలా ఆదాయం పన్ను మినహాయింపులు ఇవ్వడం మధ్య తరగతి ప్రజలకు మేలే. వ్యవసాయ రంగానికి తగిన ప్రోత్సహకాలు ఉన్నా అవి ఇంకా పెరగాలి.

బోనబోయిన శ్రీనివాస యాదవ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

రాష్ట్రానికి తీవ్ర అన్యాయం



కేంద్ర బడ్జెట్ మన రాష్ట్రానికి అన్యాయం చేసింది. రాష్ట్ర విభజన సందర్భగా ఇస్తామన్న ప్రత్యేక హోదా గురించి కేంద్ర కనీసం ప్రస్తావించలేదు. విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు కోసం నిధులు కేటాయించకుండా మొండి చేయి చూపించింది. విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు, రాజధాని నిర్మాణానికి నిధుల ఊసే బడ్జెట్‌లో లేదు. వెనక బడిన ప్రాంతాల అభ్యున్నతికి నిధులు కేటాయించలేదు. దళిత, గిరిజనులకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించలేదు. ఏ విధంగా చూసినా ఈ బడ్జెట్ సామాన్యులకు ఉపయోగంగా లేదు.

పాశం రామారావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి

అమరావతిని విస్మరించారు



రాజధాని అమరావతిని పూర్తిగా విస్మరించారు. విభజన చట్టం ప్రకారం రాజధానికి నిధులు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రానికి ఉంది. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి కూడా బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. అంకెలగారడీతో రూపొందించిన మోసపూరిత బడ్జెట్‌గా ఆయన విమర్శించారు. రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారు.

జంగాల అజయ్‌కుమార్, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి.

రాష్ట్రానికి మొండిచేయి



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపి తెలుగు ప్రజలను బిజెపి ప్రభుత్వం మరోసారి మోసం చేసింది. పోలవరం పూర్తి చేసే ఆలోచన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నట్లు లేదు. రైతాంగ ప్రయోజనాలను విస్మరించారు. దీనివల్ల మళ్లీ వలసలు పెరుగుతాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేలా ఎటువంటి నిర్ణయాలూ ఈ బడ్జెట్‌లో లేవు. విభజన హామీల ప్రస్తావన లేకపోగా రైల్వే జోన్‌ను ఇంకా సందిగ్ధంలో పెట్టారు.

షేక్ మస్తాన్ వలి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్.

ఎలక్ట్రానిక్స్ ధరలు తగ్గుతాయి



కస్టమ్స్ డ్యూటీ, దిగుమతి సుంకం తగ్గింపు వల్ల ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు తగ్గుతాయి. ప్రస్తుత బడ్జెట్ వల్ల జిఎస్‌డిపి పెరుగుతుంది. వృద్ధి రేటు పెరిగి ద్రవ్యోల్బనం తగ్గుతుంది. దాదాపు పదేళ్లుగా ఎదురుచూస్తున్న ఆదాయం పన్ను మినహాయింపులు ఈ ఏడాది ఇవ్వడం వల్ల మధ్య తరగతి ప్రజలకు ఊరట ఇచ్చినట్టే. కార్పొరేట్ సంస్కరణలు కూడా శ్రీకారం చుట్టారు. వ్యవసాయానికి కూడా బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇస్తూనే సర్వీసు సెక్టార్‌కు ప్రోత్సాహకాలు ఇచ్చారు.

కె.శ్రీనివాసరావు, వ్యవస్థాపక అధ్యక్షులు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్.

సిఎంఎ ఫౌండేషన్ ఫలితాల్లో ఆలిండియా టాపర్‌గా మాస్టర్ మైండ్స్ విద్యార్థిని

ప్రజాశక్తి-గుంటూరు



ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సిఎంఎ ఫౌండేషన్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థి బి.లక్ష్మీప్రసన్న 400 మార్కులకుగాను, 380 మార్కులు సాధించి ఆలిండియా టాపర్‌గా నిలిచినట్లు మాస్టర్ మైండ్స్ డైరెక్టర్ యం.మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి ఫలితాలను సాధించటానికి కారణం అయిన మాస్టర్ మైండ్ టీమ్ సభ్యులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



కమిషనర్, ఎమ్మెల్సీ నుండి బహుమతులు అందుకుంటున్న ప్రత్తిపాడు అక్షయ విద్యాలయం విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు

నేటితరం విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకొని ముందడుగు వేయాలని గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. బుధవారం స్థానిక హిందూ కళాశాలలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న సైన్స్ ఎక్స్‌పో-2023 ముగింపు సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ పి.ఎం.ప్రసాద్ అధ్యక్షత వహించారు. కీర్తి చేకూరి మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్నెన్నో విలువైన సైన్స్ ఆవిష్కరణలను కనుగొన్న సైంటిస్టులను మనుషులు బతికున్నంత కాలం గుర్తు పెట్టుకుంటారని, అందుకే సైంటిస్టులకు అంత విలువ ఉందని చెప్పారు. గుంటూరు నగరపాలక సంస్థకు సంబంధించి ఎన్నెన్నో సమస్యలు ఇంకా సైంటిస్టులు కనుక్కోవలసినవి వున్నాయని, అలాంటి వాటిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్‌కు సంబంధించినవీ ఉన్నాయని అన్నారు. అలాంటి సమస్యలకు నగరపాలక, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏవైనా పరిష్కారాలను కనుగొంటామంటే వారికి తగిన సహాయ సహకారాలను కార్పొరేషన్ తరపున సంపూర్ణంగా అందిస్తామన్నారు. విద్యార్థులు కేవలం డాక్టర్లు, ఇంజనీర్లుగానేకాక సైంటిస్టులుగా ఎదిగి ఎప్పటికీ ప్రపంచానికి గుర్తుండిపోయేందుకు కృషి చెయ్యాలని సూచించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను కమిషనర్ ప్రదానం చేశారు. సభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, ఎక్స్‌పో కన్వీనర్ డాక్టర్ ఎం.మాధవి, వైస్ ప్రిన్సిపాల్ కెవిఎస్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.